సాక్షి మెదక్

సోమవారం । 7 । అక్టోబర్ । 2024



పాటకు ప్రాణం బతుకమ్మ

జిల్లాకు చెందిన యూట్యూబర్స్ సత్తా చాటుతున్నారు. అంతర్జాతీయస్థాయిలో బతుకమ్మ పాటలకు అరుదైన గౌరవం తీసుకొస్తున్నారు.

వివరాలు 8లో ▸



సాంకేతికం.. ఉపాధికి ఊతం

చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యం ఉన్నప్పుడే వివిధ కంపెనీలు, పరిశ్రమలు విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తున్నాయి.

వివరాలు 8లో ▸

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: స్వయం ఉపాధి కల్పనలో భాగంగా సెల్‌ఫోన్ రిపేరింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శిక్షణ కేంద్రం డైరెక్టర్ వంగ రాజేంద్ర ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9490103390, 9490129839 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

మెరుగైన వైద్యం అందించేందుకు కృషి



మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

మునిపల్లి(అందోల్): ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం మండలంలోని బుదేరాలో మాజీ ఎంపీపీ రాజేశ్వర్‌రావు అనారోగ్యానికి గురి కాగా పరామర్శించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. 65వ నంబర్ జాతీయ రహదారిపై జరిగే రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారి కోసం అత్యవసర చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా కంకోల్ శివారులో రెండెకరాల భూమిని పరిశీలించినట్లు చెప్పారు. జాతీయ రహదారుల సమీపంలో 40 కిలోమీటర్లకు ఒకటి చొప్పున అత్యవసర చికిత్స కేంద్రాల ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగారం అంజయ్య, మాజీ ఎంపీపీ తాటిపల్లి రాంరెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సతీష్ కుమార్, గోపులారం మాజీ ఎంపీటీసీ పాండు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేస్తాం



సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామ గ్రామాన బీజేపీని బలోపేతం చేస్తామని సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. ఆదివారం పెద్దశంకరంపేటలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తెచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్రమోడీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి లక్ష్మీనర్సయ్య, మండల పార్టీ అధ్యక్షుడు కోణం విఠల్, నాయకులు శ్రావణ్, సుభాష్, రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

14న అలయ్ బలయ్



స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, నాయకులు

వట్‌పల్లి(అందోల్): ఈనెల 14వ తేదీన అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆదివారం వట్‌పల్లిలో స్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దసరా సందర్భంగా ఐదేళ్లుగా నియోజకవర్గంలో అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ బుద్దిరెడ్డి, నాయకులు వీరారెడ్డి, శివాజీరావు, నర్సింలు, మధు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో ఆర్‌ఎస్‌ఎస్ పద సంచాలన్



అర్‌ఎస్‌ఎస్ పద సంచాలన్ నిర్వహిస్తున్న స్వయం సేవకులు

నారాయణఖేడ్: పట్టణంలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో పద సంచాలన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రామాలయం నుంచి రాజీవ్ చౌక్ మీదుగా మంగల్‌పేట నుంచి మా ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ కొనసాగింది. జిల్లా సహ కార్యవాహ కొప్పులు మహేందర్, ముఖ్య అతిథి డాక్టర్ వినయ్‌కుమార్ ఆర్‌ఎస్‌ఎస్‌కు సంబంధించిన పలు విషయాలను వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ఖండ కార్యవాహ పడిత్య ప్రసాద్, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు అనిల్, నర్సింలు, దిలీప్, నగిరేశం, దత్తు, జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.




కూష్మాండ మాతగా..

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల దుర్గమ్మ ఆదివారం కూష్మాండ మాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ దంపతులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



బాలాత్రిపురసుందరి దేవిగా..

ఝరాసంగం(జహీరాబాద్): కేతకీ సంగమేశ్వర ఆలయంలో దుర్గామాత ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం బాలా త్రిపురసుందరి దేవిగా దుర్గామాత దర్శనమిచ్చారు.



శ్రీ గౌరీదేవిగా..

వర్గల్(గజ్వేల్): వర్గల్ విద్యాసరస్వతీ క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. నాలుగో రోజు ఆదివారం అమ్మవారు శ్రీ గౌరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

వరించిన పదవులు

నామినేటెడ్ పోస్టులు ఖరారు
- సంగారెడ్డి గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా అంజయ్య..
- మెదక్ జిల్లాకు సుహాసినిరెడ్డి
- అధికారికంగా ప్రకటించిన ప్రభుత్వం



అంజయ్య
సంగారెడ్డి



సుహాసినిరెడ్డి
మెదక్



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ముందస్తు ప్రచారం జరిగినట్లుగానే పలువురికి నామినేటెడ్ పోస్టులు వరించాయి. సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి గొల్ల అంజయ్యకు దక్కగా, మెదక్ జిల్లాలో సుహాసినిరెడ్డిని నియమించారు. మంత్రి దామోదర రాజనర్సింహ ప్రధాన అనుచరుల్లో ఒకరైన అంజయ్యకు ఈ పదవి వస్తుందని చాలా రోజులుగా రాజకీయవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అనుకున్నట్లుగానే ఆయనకే ఈ పదవి వరించింది. అధికార కాంగ్రెస్‌లో జిల్లాకు చెందిన పలువురు కీలక నేతలకు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు దక్కాయి. పలు కార్పొరేషన్లకు చైర్మన్లుగా నియమితులయ్యారు. జిల్లాస్థాయి నామినేటెడ్ పదవుల్లో కేస్ డెవలప్‌మెంట్ కమిటీ (సీడీసీ) చైర్మన్ వంటి నామినేటెడ్ పోస్టుల భర్తీ జరిగింది. పదవుల భర్తీ విషయంలో జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ, ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. పదవుల భర్తీ గురించి చర్చించారు. ఈ భేటీ జరిగిన రెండు, మూడు రోజుల్లోనే ఈ పోస్టును భర్తీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదివారం ప్రకటించిన పలు జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్మన్ల జాబితాలో అంజయ్య పేరు కూడా ఉంది.

2009లో పార్టీలో చేరిక..

రాయికోడ్ మండలం నాగ్వార్ గ్రామానికి చెందిన గొల్ల అంజయ్య 2009లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతకు ముందు ఆయన 1995- 2000 వరకు రాయికోడ్ ఎంపీపీగా పనిచేశారు. 2015- 20 వరకు ఇదే మండల జెడ్పీటీసీగా కొనసాగారు. ప్రస్తుతం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నారు. వృత్తిరీత్యా అడ్వకేట్ అయిన అంజయ్య 1989 నుంచి అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నారు. దసరా తర్వాత ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన మంత్రి దామోదరకు కృతజ్ఞతలు తెలిపారు.

సుహాసినిరెడ్డి వైపే మొగ్గు..

నర్సాపూర్: మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ పదవి నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకురాలు చిలుముల సుహాసినిరెడ్డికి దక్కింది. ఈ పదవి కోసం మనోహరాబాద్ మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, పాపన్నపేట మండలానికి చెందిన ప్రభాకర్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ముమ్మర ప్రయత్నాలు చేశారు. కాంగ్రెస్ ముఖ్య నాయకులతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి సుహాసినిరెడ్డి వైపు మొగ్గు చూపడంతో ఆమె పేరును ఖరారు చేశారు.

గతేడాది కాంగ్రెస్‌లోకి..

బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్న సుహాసినిరెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే సమక్షంలో ఢిల్లీలో కాంగ్రెస్‌లో చేరారు. ఆమె తనయుడు చిలప్‌చెడ్ మాజీ జెడ్పీటీసీ శేషసాయిరెడ్డి సైతం చేరారు. సుహాసినిరెడ్డి మామ దివంగత చిలుముల విఠల్‌రెడ్డి నర్సాపూర్ నియోజకవర్గం నుంచి ఐదుసార్లు సీపీఐ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. సుహాసినిరెడ్డి భర్త దివంగత కృష్ణారెడ్డి సీపీఐలో పలు హోదాల్లో పనిచేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా సుహాసినిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, ముఖ్య నాయకుల సహకారంతో జిల్లాలోని గ్రంథాలయాలను అభివృద్ధి చేసి, అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

బతుకమ్మ కానుకేది?

- ఇప్పటివరకు స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- గతంలో పండుగకు వారం ముందే చీరల పంపిణీ



బతుకమ్మ చీరలు

మెదక్‌జోన్: బతుకమ్మ పండుగకు మహిళలకు అందించే చీరల పంపిణీపై స్పష్టత కరువైంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రతి ఏడాది ఆడబిడ్డలకు చీరలు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బతుకమ్మ చీరల పథకాన్ని రద్దు చేసినట్లు తెలిపింది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఏటా రెండు చీరలు అందిస్తామని ప్రకటించింది. దీనిపై ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు జారీ కాకపోవడంతో మహిళలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

జిల్లాలో 2,65,455 మహిళలు

జిల్లాలో 18 ఏళ్లు నిండిన మహిళలు 2,65,455 మంది ఉన్నారు. గత ప్రభుత్వం 2017 నుంచి బతుకమ్మ కానుకగా చీరల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. అప్పటినుంచి ఏటా పండుగకు వారం రోజుల ముందు నుంచి చీరలు పంపిణీ చేసింది. కాగా 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బతుకమ్మ చీరల పంపిణీని పక్కన పెట్టింది.

మహిళా సంఘ సభ్యులకే..

మహిళా సంఘాల సభ్యులకు మాత్రమే బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తామని ఇటీవల బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పత్రికాముఖంగా ప్రకటించారు. జిల్లాలో మహిళా ఓటర్లు 2,65,455 మంది ఉండగా, స్వయం స్వహాయక గ్రూపుల్లో మాత్రం 1,35,859 మంది మహిళలు మాత్రమే ఉన్నారు. సంఘ సభ్యులకు మాత్రమే పంపిణీ చేస్తే మిగితా 1,29,596 మంది మహిళల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది. దీనిపై ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు. ఈసారి చీరల పంపిణీ ఉంటుందా.? లేదా అనే సందిగ్ధం నెలకొంది.

నేతన్నలకు కొండంత అండ

చేనేత కార్మికులకు గత ప్రభుత్వం అండగా నిలిచింది. వారు నేసిన చీరలను ప్రభుత్వం కొనుగోలు చేసి మహిళలకు పండగ సందర్భంగా ఉచితంగా అందజేసింది. దీంతో అటు చేనేత కార్మికులకు అండగా నిలవడంతో పాటు ఇటు మహిళలకు సైతం పండుగ సందర్భంగా కానుకలు ఇచ్చింది.

ఎలాంటి సమాచారం లేదు



బతుకమ్మ చీరల పంపిణీ విషయంపై ఇప్పటివరకు తమకు ఎలాంటి సమాచారం రాలేదు. గతేడాది 2023 వరకు ప్రతి ఏటా పండుగకు వారం రోజుల ముందే చీరలను పంపిణీ చేశాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాక తగు చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్‌రావు, డీఆర్‌డీఓ మెదక్

రైతులందరికీ రుణమాఫీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. రుణమాఫీ కాకపోవడంతో రైతులు అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. సన్న రకం వడ్లకే బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం రైతులను మరోమారు మోసం చేయడమేనని అన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయడం లేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో మహిళలకు బతుకమ్మ చీరలు అందజేసే వారని, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి చీరల బదులు నగదు ఇస్తానని చెప్పి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు జరుపుకునేందుకు ప్రభుత్వం కనీస వసతులు కల్పించలేదన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు మంత్రి రాక కోసం పంపిణీ చేయకపోవడం సరికాదన్నారు. దసరా నాటికి చెక్కులు పంపిణీ చేయని పక్షంలో లబ్ధిదారులతో కలెక్టర్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. దసరా నాటికి రైతులకు రైతు భరోసా అందజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమోద్దీన్, నాయకులు మన్సూర్, సత్యంగౌడ్, నర్సింలు, ప్రసాద్, షేక్ హుస్సేన్, మహ్మద్, యాదాగౌడ్, మహేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు ఏవీ?

కంది(సంగారెడ్డి): ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం కందిలో సీపీఎం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పేదల ఇళ్లను కూల్చుతూ ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు.

ఊరూరా బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

జహీరాబాద్ టౌన్: ఊరూరా బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. ఆడపడుచులు రంగురంగు పూలతో బతుకమ్మలను తయారు చేసి ఆటపాటలతో సందడి చేస్తున్నారు. ఆదివారం పట్టణంలోని గాయత్రి జూనియర్ కళాశాలల విద్యార్థులు బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలు తయారు చేసి అధ్యాపకులతో కలిసి ఆడిపాడారు.

విజయవాడకు గరుడ బస్సులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రింగ్‌రోడ్డు మీదుగా విజయవాడకు వెళ్లేందుకు నూతనంగా రెండు గరుడ బస్సులను బీహెచ్‌ఈఎల్ డిపో మేనేజర్ సుధా ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు బీహెచ్‌ఈఎల్ డిపో నుంచి విజయవాడకు రెండు బస్సు సర్వీసులు ప్రారంభించామన్నారు. ఈ బస్సులు రోజూ రాత్రి 9.30 గంటలకు, రాత్రి 10.30 గంటలకు డిపో నుంచి బయలుదేరుతాయని తెలిపారు. రామచంద్రాపురం, బీరంగూడ, చందానగర్, మియాపూర్ ఎక్స్‌రోడ్డు, నిజాంపేట్ క్రాస్‌రోడ్డు, జేఎన్‌టీయూ, హౌసింగ్ బోర్డు మీదుగా రైతుబజారు, మలేషియా టౌన్‌షిప్, శిల్పారామం, సైబర్ టవర్స్, మైహోం, సైబరాబాద్ కమిషనరేట్, టెలికాంనగర్, గచ్చిబౌలి రింగ్‌రోడ్డు మీదుగా విజయవాడ వెళ్లనున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చని వివరించారు.

ఉపాధికి కసరత్తు

గ్రామ సభల ద్వారా గుర్తింపు
- వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రణాళికలు
- స్థానికుల డిమాండ్ మేరకు పనులు

జిల్లాలో జాబ్ కార్డులు	2,19,000
ఉపాధి కూలీలు	4,02,000
పనులకు హాజరవుతున్న వారు	2,24,000



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

సంగారెడ్డి జోన్: రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ ద్వారా పనులు చేపట్టేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈనెల 2వ తేదీ నుంచి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి పంచాయతీలో గ్రామస్తుల సమక్షంలో సభలు నిర్వహించి పనులు గుర్తిస్తున్నారు. రైతులు, కూలీలకు లబ్ధిచేకూరే విధంగా తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని పనుల ఎంపిక చేపడుతున్నారు.

కూలీలకు అవగాహన

జిల్లాలో వచ్చే ఆర్థిక సంవత్సరం 2025- 26లో నిర్వహించే పనులను గుర్తించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. ఆయా సభలలో రైతులకు లబ్ధిచేకూరే విధంగా అవసరమయ్యే పనులను గుర్తించడంతో పాటు కూలీలకు గిట్టుబాటు అయ్యే విధంగా చూస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025 మార్చితో ముగుస్తుండడంతో వచ్చే ఆర్థిక సంవత్సరంలో నిర్వహించే పనులు గుర్తించి, ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. గుర్తించిన పనులు పంచాయతీ తీర్మానం చేసి మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి పంపుతారు. అక్కడి నుంచి జిల్లా పరిషత్‌కు పంపించి ఉన్నతాధికారుల అనుమతితో పనులు ప్రారంభిస్తారు. ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకం, కూరగాయల పందిరి సాగు, పొలాల మధ్యలో కాలువలు తీయడం, పంట పొలాలు కోతకు గురికాకుండా మట్టి కట్టలు, పశువుల కొట్టాలు, పార్కులేషన్ ట్యాంకులు, కంపోస్ట్ ఎరువు తయారీ బిట్స్, నర్సరీలతో పాటు తదితర పనులు నిర్వహిస్తుంటారు. అయితే ఉపాధి హామీ పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికి వంద రోజుల పని కల్పించేందుకు అవసరమయ్యే పనులు గుర్తిస్తారు. అదేవిధంగా ఉపాధి హామీలో చేపట్టే పనుల వివరాలను వివరిస్తూ సద్వినియోగం చేసుకునేలా రైతులకు కూలీలకు అవగాహన కల్పిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



రైతులు, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీలో పనులను గుర్తిస్తున్నాం. జాబ్కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పొంది సద్వినియోగం చేసుకోవాలి. ఉపాధి కూలీలు గ్రామస్తుల ఆధ్వర్యంలో సభలు నిర్వహించి పనులను గుర్తిస్తున్నాం. గ్రామ సభల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి.

– జ్యోతి, డీఆర్‌డీఏ, సంగారెడ్డి

క్లుప్తంగా

బైక్‌ చోరీ నిందితుడి అరెస్ట్‌


నిందితుడిని చూపుతున్న పోలీసులు

గజ్వేల్‌రూరల్‌: ద్విచక్ర వాహనం చోరీ చేసిన నిందితుడిని అరెస్ట్‌ చేసినట్లు బేగంపేట ఏఎస్‌ఐ అమృత్‌ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గజ్వేల్‌ మండలం మక్తమాసాన్‌పల్లి వద్ద సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. తూప్రాన్‌ నుంచి గజ్వేల్‌ వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న ముగ్గురు పారిపోయేందుకు ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం నస్తీపూర్‌కు చెందిన కమ్మరి నర్సింహచారి, మరో ఇద్దరు మైనర్లుగా గుర్తించారు. వారిని విచారిస్తే గత నెల 21న వర్గల్‌ మండలం మజీద్‌పల్లి (శాకారం) చౌరస్తా వద్ద ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసినట్లు అంగీకరించారని ఏఎస్‌ఐ తెలిపారు. నిందితులను పట్టుకున్న ఏఎస్‌ఐ అమృత్‌, సిబ్బంది కనకరాజు, సత్యనారాయణ, ప్రదీప్‌లను తొగుట సీఐ లతీఫ్‌ అభినందించారు.

అదృశ్యమై.. కుంటలో శవమై..


నర్సయ్య (ఫైల్‌)

చేగుంట(తూప్రాన్‌): అదృశ్యమైన వ్యక్తి కుంటలో శవమై తేలిన సంఘటన మండలంలోని మక్కరాజీపేటలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అంతు నర్సయ్య(69) గత నెలలో 14న పొలం వద్దకు వెళ్లి కనిపించకుండా పోయాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు చేగుంట పోలీస్‌ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. 22 రోజుల తర్వాత ఆదివారం స్థానిక లింగం కుంటలో శవమై తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించగా మృతదేహం నర్సయ్యదిగా గుర్తించారు. కుళ్లిపోయి ఉండటంతో సంఘటన స్థలంలోనే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహింపజేసి బంధువులకు అప్పగించారు.

తరచూ అనారోగ్యానికి గురవుతున్నానని..

వ్యక్తి ఆత్మహత్య


కుమార్‌ (ఫైల్‌)

నిజాంపేట (మెదక్‌): ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన నిజాంపేట మండలం నార్లాపూర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మిరుదొడ్డి కుమార్‌ (41) శనివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాను తరచూ అనారోగ్యానికి గురవుతున్నానని, కుటుంబాన్ని సరిగా పోషించుకోలేకపోతున్నానని తరచూ వేదన చెందేవాడని గ్రామస్తులు తెలిపారు. ఈ బాధతోనే రాత్రి గ్రామశివారులో కమ్మరి వెంకటస్వామి వ్యవసాయ క్షేత్రంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు.

పాటకు ప్రాణం బతుకమ్మ

'నెట్టింట' పాటల సందడి
- అంతర్జాతీయ స్థాయిలో విస్తృత ప్రచారం
- సత్తా చాటుతున్న చానల్స్‌
- ఈ ఏడాది ఉమ్మడి మెదక్‌ జిల్లాలో పదుల సంఖ్యల్లో పాటలు


బతుకమ్మలను పేర్చుతున్న యువతులు

సాక్షి, సిద్దిపేట: తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ ప్రతిబింబంగా నిలుస్తోంది. తెలంగాణ ప్రజల సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ. తొమ్మిది రోజుల పాటు సాగే ఉత్సవాల్లో ఆడపడుచులు ఉత్సాహంగా పాల్గొంటారు. తంగేడు, గునుగు ఇలా వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి... వాటి చుట్టూ చేరి సంతోషంగా ఆడతారు. అయితే బతుకమ్మ పండుగలో ఆడటం ఎంత ప్రధానమో పాట కూడా అంతే ప్రధానం. పూల పాటల్లో సున్నితమైన మానవ సంబంధాలు కనిపిస్తాయి. జానపద, చారిత్రక, సామాజిక అంశాలు తొణికిసలాడుతాయి. వివిధ వేదికలపై బతుకమ్మ గొప్పదనాన్ని పాటల రూపంలో వినిపిస్తూనే, యూట్యూబ్‌ చానల్స్‌తో విస్తృత ప్రచారాన్ని మెతుకుసీమ యువకులు, కళాకారులు చేస్తున్నారు. మన జిల్లాకు చెందిన యూట్యూబ్‌ చానల్స్‌ వారు సత్తా చాటుతున్నారు. అంతర్జాతీయ స్థాయిలో మన ఇంటి ఆడబిడ్డగా కీర్తించే గౌరమ్మకు అరుదైన గౌరవాన్ని తీసుకొస్తున్నారు.

బతుకమ్మ పాటలతో సందడి

పల్లె, పట్టణాల్లో ఎక్కడ చూసినా సాయంత్రం అయిందంటే ఇటు బతుకమ్మల సందడి. అటు దుమ్ములేపే పాటలతో మార్మోగిపోతున్నాయి. ఒకప్పుడు మహిళలే ఒక్కేసి పువ్వేసి చందమామ ఒక్క జాములాయె సందమామా, రామ రామ ఉయ్యాలో, శ్రీలక్ష్మి నీ మహిమలు గౌరమ్మ చిత్రమై తోచెనమ్మ గౌరమ్మ అంటూ తమ గాత్రాలతో పాటలు పాడేవారు. ఇప్పుడు జనరేషన్‌ మారడంతో అందుకు తగ్గట్టుగా ప్రతీ యేడాది బతుకమ్మ పాటలను రూపొందిస్తున్నారు. డీజేలు, ప్రత్యేకంగా సౌండ్‌ బాక్స్‌లను ఏర్పాటు చేసుకుని పాటలతో యువతులు, వృద్ధులు నృత్యాలు వేస్తూ హోరెత్తిస్తున్నారు. ఉమ్మడి మెదక్‌ జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 10కి పైగా బతుకమ్మ పాటలను రూపొందించారు.

బొడ్డెమ్మ బొడ్డెమ్మ..

సిద్దిపేటకు కళాంజలి స్టూడియో ఆధ్వర్యంలో బొడ్డెమ్మ బొడ్డెమ్మ సిరియాలో అనే బతుకమ్మ పాట రూపొందించారు. ఈ నెల 3న పాటను యూట్యూబ్‌లో విడుదల చేశారు. ఇప్పటి వరకు 30 వేలకు పైగా మంది వీక్షించారు. ఈ పాట ఎంతగానో ఆకట్టుకుంటుంది. గతంలో వివిధ పాటలలో సైతం ప్రార్థిని నటించారు.

బంతి పూల బతుకమ్మ..

కంజర ఫోక్‌ యూట్యూబ్‌ ఆధ్వర్యంలో బంతి పూల బతుకమ్మ అనే పాటను రూపొందించారు. దీనిని పుల్లూరు పరిసర ప్రాంతాల్లో పాటను చిత్రీకరించారు. ఈనెల 4న పాటను విడుదల చేశారు. దీనిని ఇప్పటి వరకు నాలుగు వేల మంది వీక్షించారు. చాలా పాటలను రూపొందిస్తున్నారు.


బతుకమ్మ సాంగ్‌ను చిత్రీకరిస్తూ

పూల జాతర...

శ్రీ చిత్ర లైఫ్‌ స్టైల్‌ యూట్యూబ్‌ చానల్‌ ఆధ్వర్యంలో పూల జాతర.... ఈ పూడమి జాతర అనే పాటను రూపొందించారు. ఈ పాట రచన విలేజ్‌ శ్రీను, మ్యూజిక్‌ సత్యదీప్‌, గానం ముకుంద, కొరియో గ్రాఫర్‌గా భవాని డ్యాన్స్‌ అకాడమీ వ్యవహరించారు. సిద్దిపేట పరిసరప్రాంతాల్లో పాట చిత్రీకరించారు. స్థానిక యువతులు నటించారు. ఇప్పటికే 12 వేల మందికి పైగా ఈ పాటను వీక్షించారు.

మా ఊరిలోనే చిత్రీకరణ



ఈ పాటను మూడు రోజుల పాటు మా ఊరులోనే చిత్రీకరించాం. మన సంస్కృతీ సంప్రదాయలను దేశమంతా తెలిసేలా ఈ పాట రూపొందించాం. బతుకమ్మ పండుగ అంటే తెలంగాణలోనే అతి పెద్ద పండుగ. పల్లెల్లో 9 రోజుల పాటు మహిళలు, యువతులు, వృద్ధులు బతుకమ్మ ఆడుతూ పాడుతారు. **చంద్రయ్య, కంజర ఫోక్‌ యూట్యూబ్‌, పుల్లూరు**

ఈ ఏడాది పదికి పైగా..



ఈ ఏడాది 10కి పైగా బతుకమ్మ పాటలకు మ్యూజిక్‌ డైరెక్టర్‌గా పని చేసి, నా స్టూడియోలోనే రికార్డింగ్‌ చేశాం. ఒక్కో పాట ద్వారా మన సంప్రదాయం ఉట్టి పడే విధంగా రూపొందించాం. అద్భుతమైన సింగర్స్‌తో పాడించా.

సత్యదీప్‌, సత్య రికార్డింగ్‌ స్టూడియో సిద్దిపేట

మనవడిని పరామర్శించి తిరిగొస్తుండగా..

బైక్‌ను ట్రాక్టర్‌ ఢీకొని వ్యక్తి మృతి


ఆకుల రాజు

కొడిపల్లి(నర్సాపూర్‌): ట్రాక్టర్‌.. బైక్‌ను ఢీకొనగా వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన కొడిపల్లి శివారులో ఆదివారం జరిగింది. కొడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌ మండలం పాతూర్‌కు చెందిన ఆకుల రాజు (48) శనివారం తన మనవడు (చిన్నకుమార్తె కొడుకు) హైదరాబాద్‌ మల్లంపేట ఆస్పత్రిలో ఉండగా పరామర్శించి తిరిగి తన బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. 765డి జాతీయ రహదారిపై కొడిపల్లి శివారులోని పెట్రోల్‌ బంక్‌ సమీపంలోకి రాగానే ఇండియన్‌ టైర్‌పంక్చర్‌ షాప్‌ వద్ద నుంచి సంగారెడ్డి జిల్లా ఇందిరానగర్‌ కాలనీకి చెందిన మెగవత్‌ రవి తన ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా నడుపుతూ బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో రాజుకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం నర్సాపూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన డాక్టర్‌ మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. రాజు భార్య విమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గెలుపోటములు సహజం

- మెదక్‌ మున్సిపల్‌ చైర్మన్‌ చంద్రపాల్‌
- అండర్‌–17 బాలికల రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్‌ టోర్నీ ప్రారంభం


మాట్లాడుతున్న మున్సిపల్‌ చైర్మన్‌ చంద్రపాల్‌

మెదక్‌జోన్‌: క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ఓడిన వారు నిరుత్సాహానికి గురికాకుండా భవిష్యత్‌లో విజయం సాధించడానికి కృషి చేయాలని మెదక్‌ మున్సిపల్‌ చైర్మన్‌ చంద్రపాల్‌ అన్నారు. ఆదివారం పట్టణంలో స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ మెదక్‌ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫుట్‌బాల్‌ అండర్‌–17 బాలికల రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని పూర్వ 10 జిల్లాల క్రీడాకారులు మెదక్‌కు విచ్చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. క్రీడల వల్ల శారీరకంగా, మానసికంగా క్రీడాకారులు దృఢంగా తయారవుతారన్నారు. ఈ టోర్నీలో పాల్గొని ప్రతిభను ప్రదర్శించాలని కోరారు. చదువుతోపాటు క్రీడల్లోను రాణిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చాలా ఉన్నాయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం క్రీడల్లో రాణించిన వారికి నగదు ప్రోత్సాహకాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలను కూడా ఇస్తున్న విషయాన్ని క్రీడాకారులుగా ఎదుగుతున్న వారు గమనించాలన్నారు. అనంతరం ఎస్జీఫ్‌ ఆర్గనైజింగ్‌ కార్యదర్శి రమేశ్‌ గంగాల మాట్లాడుతూ, పది జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారులు, 10 మంది కోచ్‌లు, 10 మంది మేనేజర్లు హాజరయ్యారన్నారు. మూడు రోజులపాటు క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. టోర్నమెంట్‌ కోఆర్డినేటర్‌ నాగరాజు ప్రసంగించారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్‌ కీడా రాష్ట్ర పరిశీలకులు ఆదర్శ్‌, జిల్లా స్పోర్ట్స్‌ ఫౌండేషన్‌ అధ్యక్షుడు జుబెర్‌, డాక్టర్‌ సురేందర్‌ రెడ్డి, డాక్టర్‌ ప్రియాంక, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, మాధవరెడ్డితో పాటు పది జిల్లాల కోచ్‌, మేనేజర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు ఆన్‌లైన్‌ తరగతులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: భారతీయ సాంకేతిక విజ్ఞన సంస్థ హైదరాబాద్‌ (ఐఐటీ హైదరాబాద్‌) సమన్వయంతో అక్షరధాన్‌ సంస్థ ఆధ్వర్యంలో ఎస్సెస్సీ విద్యార్థులను గణితంలో ఉచిత ఆన్‌లైన్‌ తరగతులను నిర్వహించనున్నట్లు ఆ సంస్థ కోఆర్డినేటర్‌ ఎం.ఎస్‌.ఆర్‌.మూర్తి ఆదివారం తెలిపారు. రానున్న త్రైమాసిక పరీక్షలకు సమాయత్తం చేసేందుకు ఈనెల 8 నుంచి 18 వరకు ఈ తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఐఐటీ హైదరాబాద్‌, బిట్స్‌ వంటి ఉన్నత విద్యా సంస్థల్లో చదువుకుంటున్న ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్సెస్సీ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఈ తరగతులు చెబుతారని పేర్కొన్నారు. www.akshradaan.net వెబ్‌సైట్‌లో జాయిన్‌ కావాలని పేర్కొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

క్యాంప్‌ కమాండర్‌ లెఫ్టినెంట్‌ కల్నల్‌ రమేశ్‌


కాడెట్లకు మెడల్స్‌ అందజేస్తున్న రమేశ్‌

గజ్వేల్‌రూరల్‌: ఎన్‌సీసీ కాడెట్లు నాయకత్వ లక్షణాలను అలవర్చుకొని సమాజ సేవలో భాగస్వామ్యం కావాలని క్యాంప్‌ కమాండర్‌ లెఫ్టినెంట్‌ కల్నల్‌ రమేశ్‌ శ్రేయాల్‌ పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్‌ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి మెదక్‌ జిల్లాకు చెందిన సుమారు 640 మంది ఎన్‌సీసీ కాడెట్లకు పది రోజులుగా కవాతు, ఫైరింగ్‌, మ్యాప్‌ రీడింగ్‌తో పాటు ట్రాఫిక్‌ రూల్స్‌, వేస్ట్‌ మేనేజ్‌మెంట్‌, మోటివేషనల్‌ తరగతులు, సైబర్‌ క్రైమ్స్‌ తదితర అంశాలపై అవగాహన కల్పించామన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను మరచిపోవద్దని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభను చాటిన కాడెట్లకు మెడల్స్‌ ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ గణపతిరావు, ఎన్‌సీసీఎన్‌ఓ కెప్టెన్‌ భవానిలతో పాటు ఆఫీసర్‌ కల్నల్‌ పీఎంఎస్‌రావు, సుబేదార్‌ మేజర్‌ రామ్‌హరి, ఎన్‌ఓ లెఫ్టినెంట్‌ మహేందర్‌రెడ్డి, వెంకటేశం, సత్య తదితరులు పాల్గొన్నారు.

లారీ సడన్‌ బ్రేక్‌..

వెనుక నుంచి ఢీకొన్న కారు, ముగ్గురికి గాయాలు


రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కొండపాక(గజ్వేల్‌): లారీని వెనుక నుంచి కారు ఢీ కొట్టడంతో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన కొండపాక మండలం రవీంద్రనగర్‌ గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బెజ్జంకి మండలం వడ్లూర్‌కు చెందిన యువకుడు శేఖర్‌ బతుకుదెరువు కోసం కొన్నేళ్ల కిందట దుబాయ్‌ వెళ్లాడు. స్వగ్రామానికి తిరిగి వస్తుండటంతో అతని స్నేహితులు అజయ్‌, సతీశ్‌లు కారులో శంషాబాద్‌లోని ఎయిర్‌పోర్టుకు వెళ్లి శేఖర్‌ను తీసుకొని వస్తున్నారు. హైదరాబాద్‌ నుంచి సిద్దిపేట వైపునకు వెళ్తున్న లారీ రవీంద్రనగర్‌ శివారులో రాజీవ్‌ రహదారిపై సడన్‌గా బ్రేక్‌ వేయడంతో వెనుక నుంచి కారు బలంగా ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వాహనం ముందు భాగంగా పూర్తిగా దెబ్బతినగా బెలూన్స్‌ ఓపెన్‌ అవ్వడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక 108 అంబులెన్‌ సిబ్బంది మహేందర్‌, శ్రీనివాస్‌లు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రమాదం జరుగగానే లారీ డ్రైవర్‌ పరారయ్యాడని స్థానికులు తెలిపారు.

బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టగా వ్యక్తి మృతి

రామాయంపేట(మెదక్‌): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని అక్కన్నపేట వద్ద ఆదివారం రాత్రి ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్యం వెంకటి (38) బైక్‌పై అక్కన్నపేట నుంచి రామాయంపేట వైపునకు వస్తున్నాడు. అక్కన్నపేట గ్రామ బస్‌ స్టేజీ సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి బైక్‌ను ఢీకొంది. దీంతో వెంకటి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అయితే ప్రమాదం జరిగిన తర్వాత వాహనం ఆగకుండా వెళ్లిపోయిందని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాంకేతికం.. ఉపాధికి ఊతం

- జిల్లాలో ఒక ప్రభుత్వ..ఆరు ప్రైవేటు కాలేజీలు
- ఫిట్టర్‌, ఎలక్ట్రీషియన్‌ కోర్సులపై యువత ఆసక్తి
- 'స్కిల్‌ ఇండియా పథకం'తో ఐటీఐ మరింత బలోపేతం


మెదక్‌లోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల


ఫిట్టర్‌లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

మెదక్‌ కలెక్టరేట్‌: నా పేరు విఘ్నేశ్‌గౌడ్‌, అల్లాదుర్గం మండలం. నేను మెదక్‌ ప్రభుత్వ ఐటీఐలో ఫిట్టర్‌ రెండో సంవత్సరం శిక్షణ పొందుతున్నా. నేటి పోటీ ప్రపంచంలో ఎన్ని డిగ్రీలున్నా... సాంకేతిక పరిజ్ఞానం లేకుండా ఉద్యోగం అసాధ్యం. ఎంతో మంది డిగ్రీలు చదివినప్పటికీ నైపుణ్యం లేకపోవడంతో ఉద్యోగాలు రాక నిరుద్యోగులుగా ఉన్నారు. ఐటీఐలో టెక్నికల్‌ కోర్సు చేస్తే పరిశ్రమల్లో మొదటి ప్రాధాన్యత ఉంటుంది. ఉద్యోగం తప్పనిసరిగా లభిస్తుందన్న భరోసా లభిస్తుంది. దీంతో పదో తరగతి పూర్తి కాగానే ఐటీఐలో చేరా. కళాశాలలో శిక్షణ బాగుంది. అల్లాదుర్గం నుంచి రోజూ బస్సులో కళాశాలకు వచ్చి వెళ్తున్నా.

సాంకేతిక నైపుణ్యం ఎంతో అవసరం

విద్యార్థులు చదువుతోపాటు సాంకేతిక నైపుణ్యం ఉన్నప్పుడే కంపెనీలు, పరిశ్రమలు ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఎలాంటి సాంకేతిక నైపుణ్యం లేని వారిని కంపెనీలు తీసుకోవడం లేదు. ఐటీఐలో ఫిట్టర్‌, ఎలక్ట్రీషియన్‌, డ్రాఫ్ట్‌మెన్‌ సివిల్‌, కోపా, డీజిల్‌ మెకానిక్‌ వంటి కోర్సుల్లో నైపుణ్యం సాధించి సర్టిఫికెట్లు పొందిన వారికి కంపెనీలు స్వాగతం పలుకుతాయి. అందుకే కేంద్ర ప్రభుత్వం స్కిల్‌ ఇండియా పథకాన్ని తీసుకొచ్చింది. ఐటీఐని స్కిల్‌ ఇండియాలో భాగం చేస్తూ టాటా కంపెనీతో భాగస్వామ్యం చేస్తూ కొత్త కోర్సులను ప్రవేశ పెట్టనున్నారు. ప్రభుత్వం సైతం ఐటీఐని మరింత బలోపేతం చేసే కార్యక్రమం చేపట్టింది.

మెరిట్‌ ఆధారంగానే

పదో తరగతి లేదా ఇంటర్‌లో విద్యార్థులు సాధించిన మెరిట్‌ ఆధారంగానే సీట్లు కేటాయిస్తారు. అలాగే ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6, బీసీ(ఏ)లకు 7, బీసీ(బి)లకు, బీసీ(సీ) 1, బీసీ(డీ) 7, దివ్యాంగులకు 7 శాతం సీట్లు కేటాయిస్తారు.

జిల్లాలో ఏడు..

జిల్లాలో మొత్తం 7 ఐటీఐ (ఇండస్ట్రియల్‌ ట్రైనింగ్‌ ఇనిస్టిట్యూట్‌)లు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ ఐటీఐ ఒక్కటి ఉండగా, మిగతా ఆరు ప్రైవేటు. ప్రభుత్వ ఐటీఐ కళాశాల మెదక్‌ జిల్లా కేంద్రంలోని ధ్యాన్‌ చంద్‌ చౌరస్తా వద్ద గల పాత పీజీ సెంటర్‌లో కొనసాగుతుండగా 5 ట్రేడ్‌లు 9 యూనిట్లు ఉన్నాయి. డీజిల్‌ మెకానిక్‌లో ఒక యూనిట్‌ ఉండగా ఫిట్టర్‌, ఎలక్ట్రీషియన్‌, డ్రాఫ్ట్‌మెన్‌ సివిల్‌, కోపా(కంప్యూటర్‌ ఆపరేటర్‌ అండ్‌ ప్రోగ్రామింగ్‌ అసిస్టెంట్‌) ట్రేడ్‌లలో 2 చొప్పున యూనిట్లు ఉన్నాయి. డీజిల్‌ మెకానిక్‌లో 21 మంది, ఫిట్టర్‌, ఎలక్ట్రీషియన్‌, డ్రాఫ్ట్‌మెన్‌ సివిల్‌లో 21 మంది చొప్పున విద్యార్థులు ఉండాల్సి ఉండగా అందరూ ఉన్నారు. కోఫా ట్రేడ్‌లో 52 మందికి గాను తక్కువగా ఉన్నారు.

జెఎల్‌ఎంయే లక్ష్యం



జూనియర్‌ లైన్‌మెన్‌ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా నేను ఐటీఐలో చేరా. ఎలక్ట్రీషియన్‌ ట్రేడ్‌ రెండో సంవత్సరం చదువుతున్నా. శిక్షణ బాగుంది. ప్రాక్టీస్‌ చేయిస్తున్నారు. మూడు నెలలపాటు హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో అప్రెంటీస్‌ శిక్షణ ఇప్పించారు.

-ప్రేమ్‌కుమార్‌, ఎలక్ట్రీషియన్‌ విద్యార్థి

అడ్వాన్స్‌డ్‌ సెంటర్‌ నిర్మాణంలో ఉంది






ఐటీఐ కళాశాల కోసం హవేళీఘనాపూర్‌లోని డైట్‌ కళాశాల సమీపంలో రెండున్నర ఎకరాల స్థలంలో ప్రభుత్వం ద్వారా అడ్వాన్స్‌డ్‌ ట్రైనింగ్‌ సెంటర్‌ నిర్మాణం జరుగుతుంది. నిర్మాణం పూర్తికాగానే ఇందులో మ్యానుఫ్యాక్చరింగ్‌ ప్రాసెస్‌ కంట్రోల్‌ ఆటోమేషన్‌, ఇండస్ట్రియల్‌ రోబోటిక్స్‌ అండ్‌ డిజిటల్‌, మ్యానుఫ్యాక్చరింగ్‌ టెక్నీషియన్‌, ఆర్టిజన్‌ యూజింగ్‌ అడ్వాన్స్‌డ్‌ టూల్‌, బేసిక్‌ డిజైనర్‌ అండ్‌ వర్చువల్‌ వెరిఫైయర్‌, అడ్వాన్స్‌డ్‌ సీఎస్‌సీ మిషన్‌ టెక్నీషియన్‌ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

శ్రీనివాసులు, ప్రిన్సిపాల్‌, ఐటీఐ, మెదక్‌

ప్రకృతి చెక్కిన శిల్పాలు

సంగారెడ్డి నుంచి నారాయణఖేడ్‌ వెళ్లే దారిలో అల్లాదుర్గం, పెద్దశంకరంపేట శివారులో జాతీయ రహదారికి ఇరువైపులా ఎత్తయిన కొండలు, పెద్ద పెద్ద బండరాళ్లు ఎవరో పేర్చినట్టు అందంగా, అద్భుతంగా కనిపిస్తున్నాయి. శిల్పులు చెక్కిన శిల్పాల వలె ముగ్ధ మనోహరంగా కనిపిస్తున్నాయి. ఆ దారి వెంట వెళ్లే ప్రయాణికులు ప్రకృతి ఒడిలో దాగి ఉన్న సుందర దృశ్యాలను చూస్తూ మైమరచిపోతున్నారు.

- సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, సంగారెడ్డి




సంగారెడ్డి నుంచి నారాయణఖేడ్‌ వెళ్లే దారిలో ఉన్న శిల్పాలు